తెలుగువారి తొలి వేడుక ఉగాది

- ఆలయాల్లో పంచాంగ పఠనాలు
- సందడిగా తెలుగు లోగిళ్లు



పీఠంలో భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న పీఠాధిపతి గాడ్

రాయవరం: తెలుగు వారి తొలి పండుగ ఉగాది అని, తెలుగు పదానికి ఉగాది ఆయువు పట్టు అని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) అన్నారు. పీఠంలో మంగళవారం ఉగాది వేడుకలు నిర్వహించారు.హాజరైన భక్తులను ఉద్దేశించి పీఠాధిపతి గాడ్ మాట్లాడుతూ పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. తెలుగువారి తొలి పండుగ అయిన ఉగాదికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. పీఠానికి వచ్చిన భక్తులు పీఠంలో విజయదుర్గా అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పీఠంలో ఆస్థాన కవి గొర్తి వెంకట సుబ్రహ్మణ్యం పంచాంగ పఠనం చేశారు. కాగా ఉగాది పర్వదినంతో తెలుగు లోగిళ్లు సందడి సందడిగా మారాయి. ఉదయాన్నే ప్రతి ఒక్కరూ ఆలయాలకు వెళ్లి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. షడ్రుచుల మేళవింపుతో కూడిన ఉగాది పచ్చడిని ఆస్వాదించారు. రాయవరంలోని పార్వతీ సమేత రాజేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మశ్రీ విలపర్తి ఫణిధర్‌శర్మ, సోమేశ్వరం శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరాలయంలో పరిటాల సుబ్రహ్మణ్యశర్మ పంచాంగ పఠనం చేశారు. మండలంలోని రాయవరం, వెదురుపాక, వి.సావరం, లొల్ల, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి గ్రామాల్లో ఉగాది పర్వదినాన్ని నిర్వహించుకుని పలువురు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వసంత నవరాత్రులు ప్రారంభం

విజయదుర్గా పీఠంలో మంగళవారం వసంత నవరాత్ర వేడుకలు ప్రారంభమయ్యాయి. విజయదుర్గా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వసంత మాతగా అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ నెల 18 వరకు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్టు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. మూడు రోజుల పాటు దుర్గాదేవి, మరో మూడు రోజులు లక్ష్మీదేవి, మరో మూడు రోజులు సరస్వతీదేవిగా విజయదుర్గాదేవికి పూజలు చేయనున్నట్టు వివరించారు. ఉగాది వేడుకలను పురస్కరించుకుని పీఠంలో శ్రీదేవి, భూదేవి సమేత విజయ వేంకటేశ్వరస్వామి వారికి లక్షతులసి పూజ నిర్వహించారు. విజయదుర్గా అమ్మవారిని నయనానందకరంగా అలంకరించి పీఠబ్రహ్మ చీమలకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో హాజరైన భక్తులు అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పీఠానికి వచ్చిన భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. అన్నసమారాధన నిర్వహించారు.

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల ప్రజలు మంగళవారం ఉగాది పండుగను సంతోషంగా జరుపుకున్నారు. పుణ్యస్నానమాచరించి దేవతామూర్తుల ఆలయాలను సందర్శించారు. అంగరలోని వేణుగోపాలస్వామి ఆలయంలో పెద్దింటి మురళీకృష్ణమాచార్యులు పర్యవేక్షణలో వారణాసి వెంకటేశ్వరరావు పంచాంగ పఠనం చేశారు. నూతన సంవత్సరం శుభకరం కావాలని కోరుతూ ప్రజలు ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. గ్రామాల ప్రధాన సెంటర్లలో ప్రజా, సేవా సంఘాలు ఉగాది పచ్చడి అందజేశారు. కపిలేశ్వరపురం, తాతపూడి, పడమర ఖండ్రిక, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు, వడ్లమూరు, నిడసనమెట్ట, అచ్యుతాపురం, నల్లూరు, టేకి, కాలేరు, మాచర, కోరుమిల్లి, నాగులచెరువు, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లోని దేవతామూర్తుల ఆలయాలు సందడిగా మారాయి. అమ్మవార్లకు ఆడపడుచులు నైవేద్యం సమర్పించారు.

మండపేట: తెలుగువారి కొత్త సంవత్సరాది సందర్భంగా మంగళవారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలుచోట్ల పంచాంగ పఠనాలు నిర్వహించారు. ఉగాది శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఉగాది పచ్చడిని ఒకరికొకరు పంచుకున్నారు. పట్టణంలోని రథం గుడి, వేంకటేశ్వరస్వామివారి ఆలయం, శివాలయం, కొండపల్లి వారి వీధిలోని దుర్గమ్మ ఆలయం, ఏడిద రోడ్డులోని పెద్దమ్మ తల్లి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచి భక్తులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ద్వారపూడిలోని అయ్యప్పస్వామి ఆలయం, అర్తమూరులోని వేంకటేశ్వరస్వామివారి, తాపేశ్వరం, ఇప్పనపాడు, కేశవరం, ఏడిద తదితర గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి.

కనకదుర్గమ్మ తీర్థ మహోత్సవం

అర్తమూరులోని కనకదుర్గమ్మ తీర్థ మహోత్సవం ఉగాడి నాడు ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్, ఉప సర్పంచ్ కర్రి సత్యనారాయణరెడ్డి (జంబయ్య) ఆధ్వర్యంలో ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. అర్తమూరు, పరిసర గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

కాజులూరులో..

కాజులూరు: మండల గ్రామాల్లో మంగళవారం ఆంధ్రుల తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ కార్యక్రమాలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. శోభకృత్ నామ సంవత్సరానికి వీడ్కోలు పలికి క్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రతి ఇంటా షడ్రుచుల సమ్మేళనంతో ఉగాది పచ్చడి తయారు చేసుకుని ఆరగించారు. మామిడి తోరణాలు, పూల అలంకరణలతో ప్రతి ఇల్లు కళకళలాడాయి. ఒకరికొకరు పరస్పరం ఉగాది శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లోని పలు ఆలయాల్లో పంచాంగ పఠనాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పీఠంలో ప్రత్యేక అలంకరణలో విజయదుర్గ అమ్మవారు



అంగరలో పంచాంగ పఠనం చేస్తున్న వారణాసి వెంకటేశ్వరరావు



అర్తమూరులోని కనకదుర్గమ్మ ఆలయంలో భక్తుల పూజలు



షడ్రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడి

క్లుప్తంగా

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం: రామచంద్రపురంలో 33/11 కేవీ టౌన్ సబ్ స్టేషన్‌లో 11 కేవీ ఓదూరు ఫీడర్, 33/11కేవీ చోడవరం ఇండస్ట్రియల్ ఫీడర్ అత్యవసర మరమ్మతుల నిమిత్తం, 132 కేవీ కాకినాడ, రామచంద్రపురం డీసీ పనుల బుధవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.విజయనంద మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు చోడవరం నూకల మిల్లు, నరసాపురపుపేట, ఓదూరు పరిధిలోని ఆక్వా సర్వీసుల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రేపటి నుంచి ఎంపీ బోస్ ఇంటింటి పర్యటన

కాజులూరు: మండల కేంద్రమైన కాజులూరులో గురువారం నుంచి రాజ్యసభ సభ్యుడు (ఎంపీ) పిల్లి సుభాష్‌చంద్రబోస్ ఇంటింటి పర్యటన చేపట్టనున్నట్టు సర్పంచ్ దండంగి సరోజని తెలిపారు. మంగళవారం గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గురువారం, శుక్రవారంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్ర బోస్ ఇంటింటా పర్యటించి ఆయన తనయుడు, రామచంద్రపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారన్నారు. మండల గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సహకార సంఘాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు విధిగా హాజరు కావాలన్నారు.

భీమేశ్వరాలయంలో ఉగాది పంచాంగ పఠనం



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో పంచాంగ పఠనం చేస్తున్న గోపాలకృష్ణ

రామచంద్రపురం రూరల్: తెలుగువారి నూతన సంవత్సర వేడుక క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరాలయ ప్రాంగణంలో ఉగాది వేడుక ఆద్యంతం తెలుగుదనం ఉట్టిపడేలా ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మేడవరపు గోపాలకృష్ణ పంచాంగ పఠనం, సంవత్సర రాశి ఫలాలు సభకు వివరించారు.

చలివేంద్రాలు ప్రారంభం



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆలయ అర్చకులు, ఈఓ తారకేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని ఆలయ ఈఓ పి.తారకేశ్వరరావు మంగళవారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆలయ దర్శనానికి వచ్చేసే భక్తులకు చల్లని మజ్జిగను నిరంతరాయంగా అందించనున్నారు. కార్యక్రమంలో మొల్లేటి శ్రీనివాస్, నరాల ఏడుకొండలు, బొండాల కృష్ణ, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా ద్రాక్షారామ సూర్యచంద్ర ఆటో యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు మాగాపు అమ్మిరాజు చేతుల మీదుగా మజ్జిగ చలివేంద్రం ప్రారంభించి ప్రయాణికులకు మజ్జిగ, ఉగాది పచ్చడి అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు వలీ భాషా, కార్యదర్శి విజయ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

నవమి ఉత్సవాలకు పందిరి రాట ముహూర్తం



పి.గన్నవరం సెంటర్లో శ్రీరామనవమి ఉత్సవాలకు పందిరిరాట ముహూర్తం చేస్తున్న దృశ్యం

పి.గన్నవరం: ఈనెల 17 నుంచి పి.గన్నవరంలో సీతారామ వర్తక సంఘం ఆధ్వర్యంలో జరగనున్న శ్రీరామ నవమి ఉత్సవాలకు మంగళవారం పందిరిరాట ముహూర్తం చేశారు. స్థానిక మూడు రోడ్ల సెంటర్లో పురోహితులు మిర్తిపాటి సూరిబాబు ఆధ్వర్యంలో బలబద్ర మోహనరావు పూజలు చేశారు. వర్తక సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు తెలగారెడ్డి అగ్ని సుబ్బారావు, దొమ్మేటి వెంకటేశ్వరరావు, సభ్యులు రాలింగి కోటేశ్వరరావు, నల్లా పెదకాపు, గిడుగు బాబ్జీ, తమ్మన ప్రసాద్, యడ్లపల్లి రాము, షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



హసన్‌బాదలో పార్టీలో చేరిన వారితో నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్

రామచంద్రపురం రూరల్: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ సమక్షంలో పలువురు యువకులు, పెద్దలు ఉగాది పర్వదినం రోజైన మంగళవారం టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. మండలంలోని ద్రాక్షారామ శభాష్ పేటకు చెందిన పలువురు యువకులు హసన్‌బాదలోని ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ ఇంటి వద్ద పార్టీలో చేరగా వారికి సూర్యప్రకాష్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అదే విధంగా కె.గంగవరం మండలం సత్యవాడ గ్రామం నుంచి జనసేన నుంచి పలువురు పార్టీలోకి చేరగా వారికి సూర్యప్రకాష్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రామచంద్రపురం మండలం వెలంపాలెంలో పలువురు నాయకులు పిల్లి సూర్యప్రకాష్ నాయకత్వం బలపరుస్తూ వైఎస్సార్ సీపీలో చేరారు. అందరినీ కలుపుకుని నియోజకవర్గంలో పార్టీకి తిరుగులేని మెజార్టీ వచ్చే విధంగా కృషి చేద్దామని పార్టీలో చేరిన వారికి సూర్యప్రకాష్ పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు చింతలపాటి శ్రీనివాసరాజు, పార్టీ నాయకుడు కూనిశెట్టి ప్రకాశరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేలు జరిగితేనే ఓటు వేయండనే ధైర్యం జగన్‌కే ఉంది



వెలంపాలెం షాబాజియా మసీదు ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న ఎంపీ బోస్

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెం షాబాజియా మసీదులో ముస్లిం నాయకులు ఇచ్చిన ఇఫ్తార్ విందులో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలకు దివంగత వైఎస్సార్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. అదే బాటలో ఆయన తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల ద్వారా ఆదుకున్నారన్నారు. మా ప్రభుత్వంలో మీకు మేలు జరిగితేనే మళ్లీ మాకు ఓటు వేయాలని చెప్పే ధైర్యం జగన్‌కే చెల్లిందన్నారు. రానున్న ఎన్నికల్లో తన కుమారుడు పిల్లి సూర్యప్రకాష్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎండీ గులాబ్, ఎండీ యాకూబ్, మహ్మమ్మద్, గుల్జార్ హుస్సేన్, ఎస్‌కే ఖాజా, ఎస్‌కే జిలానీ, అలీహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఎన్నికల ప్రచారం



ఉండూరులో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాష్

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఉండూరులో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ ఎన్నికల ప్రచారం మంగళవారం జోరుగా సాగింది. గ్రామ ఎంపీటీసీ ఇంత కనకదుర్గ సుకుమార్, సొసైటీ చైర్మన్ దంగేటి వెంకటరమణ(చినబాబు), మాజీ సర్పంచ్ కొప్పిశెట్టి ఏడుకొండలు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఇంత సంతోషం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆద్యంతం గ్రామ ప్రజలు సూర్యప్రకాష్‌కు పూలు జల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అవ్వా, తాతలకు, మహిళలకు, యువతకు అన్ని వర్గాలకు ఎనలేని మేలు చేశారన్నారు. మరోసారి జగనన్నను గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవాని, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి రాపాకను కలిసిన ఏఎంసీ చైర్మన్



రాపాకను ఆయన నివాసంలో కలిసిన నక్కా సింహాచలం

కపిలేశ్వరపురం: వైఎస్సార్‌సీపీ అమలాపురం ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావును మండపేట ఏఎంసీ చైర్మన్ నక్కా సింహాచలం మంగళవారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఏఎంసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా రాపాకను సింహాచలం కలిసారు. రాపాకను కలిసిన వారిలో రాయవరం మండలం పసలపూడి వైఎస్సార్ సీపీ నాయకులు ద్వారంపూడి రామచంద్రారెడ్డి, తవిటికి రత్నకుమార్, కపిలేశ్వరపురం నాయకులు గొల్లపల్లి అంజిబాబు, తాతపూడి నాయకులు సత్యాల సంతోష్ ఉన్నారు.

కాలినడకన భద్రాచలం రాములోరి గుడికి..



పోలేరమ్మ గుడి వద్ద నుంచి పాదయాత్రను ప్రారంభించిన అయ్యప్ప స్వాములు

మండపేట: పట్టణంలోని 22వ వార్డుకు చెందిన పిల్లి సత్తిబాబు, నల్లా వీర్రాజు అనే ఇద్దరు అయ్యప్ప భక్తులు భద్రాచలంలోని రాములోరి దర్శనానికి కాలినడకన మంగళవారం పయనమయ్యారు. ఈ నెల 17న జరిగే శ్రీరామ నవమి ఉత్సవాలు తిలకించేందుకు కాలి నడకన వెళ్లాలని వారిద్దరూ మొక్కుకున్నారు. మంగళవారం కలువపువ్వు సెంటర్లోని దుర్గమ్మ ఆలయంలో వారిద్దరూ పూజలు నిర్వహించాక చెప్పులు లేకుండా పాదయాత్రగా భద్రాచలం పయనమయ్యారు. వారి పాద యాత్రను 22వ వార్డు కౌన్సిలర్ బొక్కా సరస్వతి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, 29వ వార్డు కౌన్సిలర్ పిల్లి శ్రీనివాసులు ఆంజనేయ స్వామి వారి జండా ఊపి ప్రారంభించారు. వారిద్దరి పాదయాత్రను పురస్కరించుకొని ఏడిద రోడ్డులోని పోలేరమ్మ ఆలయం వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని కోన, పిల్లి శ్రీనివాసులు ప్రారంభించారు. కార్యక్రమంలో బిళ్ళకుర్తి పరమేశ్వరరావు, జొన్నపల్లి సత్తిబాబు, అప్పురబోతు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోండి



కోట గ్రామంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, డీఎస్పీ రామకృష్ణ, సీఐ దొరరాజు తదితరులు

కె.గంగవరం: ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ, సీఐ పి.దొరరాజు అన్నారు. మండలంలోని పాతకోట, కోటిపల్లి గ్రామాల్లో మంగళవారం సాయంత్రం పోలీస్ బలగాలతో కవాతు నిర్వహించి రెండు గ్రామాల్లో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. ఓటు హక్కు వినియోగించుకోవడంతో ఎటువంటి భయభ్రాంతులకు గురికాకుండా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. నిబంధనలను పాటించకుండా గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలకు, గొడవలకు దిగితే చట్టపరంగా చర్యలు తీసుకుని వారిపై శిక్ష విధిస్తామని వారు హెచ్చరించారు. కె.గంగవరం ఎస్సై జానీబాషా, స్థానిక పోలీస్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల సంబరాలు



బియ్యంపేట తలుపులమ్మ ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన అమ్మవారి వాహనం



ద్రాక్షారామ ముత్యాలమ్మ వారి ఆలయం వద్ద నిర్వహిస్తున్న సిరిమానోత్సవం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ గ్రామ దేవతలు తలుపులమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల తీర్థం, సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తలుపులమ్మ అమ సంబరం సందర్భంగా ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన వాహనం, శక్తి వేషాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ముత్యాలమ్మ ఆలయం వద్ద సిరిమానోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముత్యాలమ్మ అమ్మవారిని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ దర్శించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

మామిడికుదురు: ఎస్టీయూ మామిడికుదురు మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సామాజిక భవనంలో మండల శాఖ అధ్యక్షుడు కారుపల్లి కల్యాణ్‌బాబు సారథ్యంలో ముస్లిం ఉపాధ్యాయులకు సోమవారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నాగిరెడ్డి శివప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చొప్పల రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు పాల్గొన్నారు.

భక్తుల దాహార్తి తీర్చిన చలివేంద్రాలు

ఆలమూరు: చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి తీర్థోత్సవాలను పురస్కరించుకుని ఉగాది పర్వదినాన దాతలు మంగళవారం విరివిగా ఏర్పాటు చేసిన చలివేంద్రాలు భక్తుల దాహార్తిని తీర్చాయి. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గోశాల–గోపరంధామం కమిటీ పర్యవేక్షణలో ప్రముఖ పారిశ్రామిక వేత్త వసుం సత్యనారాయణ (అన్నవరం) మజ్జిగ చలివేంద్రానికి ఆర్థిక తోడ్పాటు అందించారు. కొత్తూరు సెంటర్‌లో బాలాజీ స్టీల్స్, కలవచర్ల యూత్, చింతలూరులో గౌడ యూత్, విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాల్లో మజ్జిగ, బెల్లపు పానకం, మంచినీటిని అందించడంతో పాటు పులిహోర పొట్లాలు పంపిణీ చేశారు. అలాగే సంధిపూడికి చెందిన కోదండరామ సేవా సమితి, పినపళ్లలో శెట్టిబలిజ యూత్ ఈ చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. వేసవిలో చల్లని పానీయాలు అందించి దాహార్తి తీర్చిన దాతలను భక్తులను అభినందించారు.

చింతలూరులోని గోశాల–గోపరంధామం వద్ద చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం →

